

# కన్నయ్య కథ

"నేను నమ్మను" అన్నది రాధ, చేతిలో పెరుగు చిలుకుతున్న కవ్వం తాటిని వదిలి వెనుదిరుగుతూ.

"నీ కళ్లారా చూస్తే నమ్మదువుగాని. త్వరగా బయలుదేరు" అంటూ ఆమె చేతిని తనచేత్తో పెనవేసి వాకిలివేపు అడుగు లేసింది సుమతి.

నడుస్తున్నంతమేరా నోరు మూతబడకుండా రాధతో మాట్లాడుతూనే వుంది సుమతి, నందునిలోగిలి చేరేవరకూను. నేటి ప్రాతఃకాలాన నందగోపుని ముంగిలి బాలభానుని లేలేత కిరణాలతో అందాలు చిందటములేదు. ముంగిట ముగ్గుల రంగవల్లులు కరువై వాకిలి వెలవెలబోతున్నది. సింహద్వారంలోనుంచి ఒక అంగలో భవనం లోతట్టు చేరుకున్నారు రాధ సుమతి. అడుగు ముందుకు వేయబోయి ఆగిపోయింది రాధమ్మ. ఎదురుగా పైడిగొలుసుల బంగారు ఉయ్యాల మంచంమీద, పట్టు పరుపులమీద నల్లనయ్య ఒత్తిగిలి పవ్వళించి వున్నాడు. ప్రక్కనే పదిమందివారు, వీరు అంతా చేరివున్నారు. యశోదతల్లి సరిగంచు పైటచెంగుతో కనులు వత్తి వత్తి వున్నది కాబోలు, అవి ఎర్రబడి వుబ్బివున్నాయి. అయినా కన్నీరు ముత్యాలలా జాలువారుతూనే వున్నది.

"రాధే రాధా! మన ప్రాణాధారమైన ఈ పసివాడి వరసచూడు. రాత్రినించీ నా తండ్రి యీ తీరున వున్నాడు" అంటూ బావురుమన్నది.

రాధ మనస్సులో అర్ధరాత్రి మిగిలే వరకూ యశోదానందనుడు యమునా తీరాన రాసక్రీడలలో తేలిన మధురస్మృతి మెరసిపడింది. ఎవరికీ తెలియకుండా పడక చేరిన నందనందనుడు, అప్పటినుంచీ ఇప్పటివరకూ, స్పృహలేకుండా వేదన పడుతూ, మూసినకన్ను తెరవక తపన చెందుతున్న విషయం సుమతి వర్ణించినదే, యశోద మరొకమారు రాధకు వివరించింది.

"వాడిబాధ చూడలేక మతిపోయి వున్నాము. ఎవరు వచ్చిపోతున్నారోకూడ గమనించటంలేదే రాధా. నీకు కబురు పంపాలనే ధ్యాసకూడా లేకపోయింది" అంటూ దుఃఖపూరితమైన స్వరంతో రాధ మనస్సు నొవ్వకుండేట్లుండాలని నందయ్య నాలుగుమాటలు పలికాడు.

"రాత్రి నా బుజ్జితండ్రికి నా చేతులతోనే పెరుగన్నం తినిపించి జోలపాడి నిదురబుచ్చాను. అర్ధరాత్రి దాటినదేమో, మెలకువవచ్చి చూతునుకదా, నా నాయన బాధతో మెలికలు తిరుగుతూ తపనపడుతున్నాడు. మీ అన్నగారు ఖంగారుతో ఊరిలో వైద్యులకోసం పరుగెత్తారు. చుట్టుప్రక్కల వున్నవారంతా, అప్పుడే ఎలా తెలిసిందో ఇంటిలో మూసిరారు. వైద్యులు వచ్చారు; ఏవో మూలికలు ఔషధాలు అన్నీ నూరారు; పట్లువేశారు. నాతండ్రి కన్నెత్తి ఈ క్షణంవరకూ ఎవరినీ చూడలేదు. నా తండ్రి బాధ ఏమిచేసే నాతల్లీ" అంటూ యశోదమ్మ మరొకసారి బావురుమన్నది.

రాధ చివాలున ఆమెముందు కూలబడి "ఏమిటి వదినా ఇలాగ మరీ బేలవౌతున్నావు? నిన్నుచూసి అన్నయ్య మరీ బెంబేలెత్తటంలేదా? ఆ గోపిక లందరివంకా చూడు ఎలాగ దైన్యంతో చేష్టలు దక్కి ఉన్నారోను; కోష్ఠంలో గోవులు లేగలు కూడా మేతమాని కన్నీరు విడుస్తూ మోరలెత్తి ఇంటివేపు చూస్తున్నాయి. ఎన్నెన్నో గండాలను అతి చిన్నవయస్సులోనే దాటిన

ఆ నందకిశోరుడు ఏదో కా నికి కట్టుబడి బాధపడుతున్నట్లు కనిపిస్తున్నాడేగాని ఈ బాధలు ఒక లెక్కా-చెప్పు. ధైర్యం తెచ్చుకొని ఊరడిల్లు మరి. వైద్యుల అమోఘమైన ఔషధాలతో తొందరగానే తేరుకుంటాడు మన కనులవెలుగు. నువ్వు దిగులు పడకు'' అంటూనే రాధ కృష్ణయ్య పాన్పు దగ్గరకి నడిచింది.

సూర్యోదయానికి ముకుళించుకొన్న కలువపువ్వుల జంటలా కళ్లు మూసుకొని పట్టుదిండ్ల వామకొన ఓసరి పవ్వళించిన నల్లనయ్యను చూస్తూ రాధ మనస్సులో. ఇంతవరకు యశోదతల్లికి చెప్పిన ధైర్యపు రేకల తాలూకు చిహ్నాలైనా మిగలక మాయమై, కలవరపాటు మేఘాలామె హృదయాకాశాన్ని కమ్మివేశాయి. రాత్రి రాసక్రీడల తేలిన కొంటె బాలుడు యితడేనా తాను నవ్వుతూ అందరినీ నవ్వించే ఆనందమూర్తి యితడేనా సుందరమైన అరవిందంలాంటి మోమంతా వేదనపడుతున్న చిహ్నాలు దట్టంగా అలముకొని, చూసేవారి మనస్సులో దుఃఖభారాన్ని ద్విగుణీకృతంచేస్తున్నాయి. ఒక రాత్రిలోనే శరీరం రవంత కృశించిన తీరుకూడా ద్యోతకమౌతున్నది. రాధ వేదనచెందుతున్న మనస్సుతో స్వరంతో పలుమార్లాతనిని పలకరించింది. సున్నితమైన చేతివేళ్లను తన చేతిలో పట్టుకొని కదిలించి చూసింది. కాని నల్లనయ్య కనులు తెరవలేదు. అదే తీరున రోజంతా అతనిపడక పీడను గడిపిన రాధకి నిరాశే మిగిలింది కాని రవంతైనా ఆశ కలగలేదు. వెజ్జులు వస్తూనే ఉన్నారు. వైద్యంచేస్తూనే ఉన్నారు కాయకష్టులా కాని, వ్యాధి లొంగినట్లు కనిపించలేదు.

ఇంట్లో వారికి బైటవారికి కూడా ఇతర పనులకి దిక్కు-తోచలేదు. నల్లనయ్యను అంటిపెట్టుకొని ఉండటం విడిచి పొద్దుగూకేవేళకు రాధ, తన ఇంటి సంగతి రవంత చూసుకొని మళ్లీ వెంటనే వస్తానని యశోద తల్లితోచెప్పి బయలుదేరింది. బైటకు అడుగుపెట్టే ముందు క్షణంలో సగంసేపు నల్లనయ్య ముద్దుమోము చూస్తూ నిలబడిన రాధ కనులలో యిందుపగింజ అంత బాష్పకణాలు చెక్కిళ్లమీంచి జారి అతని ముఖంమీద చెరిగిన కస్తూరిబొట్టుపై పడ్డాయి. అర్ధ చంద్రునివంటి అనుదుటిపై నిలచిన గుండ్రని కన్నీటిబిందువులో రాసక్రీడాలోలుని, యమునానదీ సైకతాలపై పరుగులెత్తే కొంటెగోపబాలుని పరమానందమూర్తి పకపకనవ్వుతూ కనిపించింది. ఉలికిపడిన రాధ అది తన భ్రమేననుకుంటూ గృహోన్ముఖురాలైంది.

సంధ్యవేళ ఇల్లు చేరుతూనే కడవతీసుకుని యమునవేపు సాగిపోయింది రాధ ఏమి చెయ్యాలో తోచని తనంతో. దోవ పొడుగునా మల్లెపొదలు, మాలతీ లతలు ఆమెకాలి కడ్డంపడుతూ 'కృష్ణుడేడీ?'' అని అడుగుతున్నట్లే అనిపించింది, స్వామి నడయాడని బృందావన పథాలామెను వెక్కిరించినవి. అను నిత్యము నందగోపాలుడు సుఖాసీనుడై ఉండే పకుళ వృక్షమూలము నేడెంతో చిన్నబోయింది. శుక్లపక్షమైనా చంద్రుడు మబ్బులచాటున విషాదంతో ముఖం దాచుకొన్నట్లున్నాడు, రాధ కడవను యమున చల్లనినీటిలో ముంచినప్పు డామెను ఎన్నో మధురానుభూతులు ముసురుకొన్నాయి. వెదురు పొదలలో సంచరించే మలయపవనములు కూడా జాలిగా ఆర్తిగా ధ్వనిస్తున్నది. రాధ హృదయంపై విషాదం చెరగని ముద్రవేస్తున్నది. ఎదురుగా కనుచూపు మేరలో కనబడే గోవర్ధనగిరిని చూస్తూ రాధ మెల్లిగా ఆ దెసకు అడుగులు వేయసాగింది. మహాపర్వతమైన ఆ గిరిని కొనగోటిపై నిలబెట్టిన నందబాలుడు నేడు ఎంతబాధ ననుభవిస్తున్నాడు? అరణ్యంలో దావాగ్నినుంచి, కుటిలులైన రాక్షసుల బారినుంచి వ్రేపల్లెవాసులను కాపాడిన మానవాతీతు డితడేనా అంత బాధ ననుభవిస్తున్నది అని రాధ మనస్సు తల్లడిల్లుతున్నది. ఇది కేవలం ఒక నటన ఏమో? ఆలోచిస్తూ గోవర్ధనగిరి ప్రాంతానికి చేరుకొన్న రాధకు ఆ పర్వతపాదములో ఎవరో మనుష్యులు కనిపించారు.

ఇరువురు స్త్రీ పురుషులు బహూశా దంపతులై ఉండవచ్చును. ఒక పసి బాలునితో ఆగిరి మొదట పూజ చేస్తున్నారు. రాధ విస్మయంతో వారిని సమీపించి పలక




## శ్రీ బాలాజీ వైద్యశాల

డా॥ పి. కుమారస్వామి దేవర
మార్వాడీ గుడివద్ద ఫోన్ : 551, తెనాలి (ఏ.పి.)
బ్రాంచి : 9-D, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక దోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వస్థులు, కుష్ఠు - బొల్లి, చర్మ వ్యాధులు హెర్నియా (గిలక), పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం, దగ్గులకు ఉచిత వైద్యం. రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండ బాగు చేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

రించింది.

వారు చెప్పిన విషయం సారాంశం ఏమిటంటే గోవర్ధనగిరి వెనుక అలతి దూరాన ఉండే ఒక పల్లె వారి నివాసం. స్వామి గోవర్ధనధారి అయిన తరుణంలో వారుకూడా ప్రళయంలో వెనుకష్టాలకు లోనై తుదకా పసిబాలునితో కొండ గొడుగు క్రిందచేరి క్షేమంగా బ్రతికి బైట పడ్డారు. వాన వెలసిన పిమ్మట తమ పల్లె చేరుకొని, తమ ప్రాణాలను కాపాడిన బాలగోపాలదేవుని తమ యిలవేల్పుగా పూజిస్తూ సుఖంగా కాలం గడుపుతున్నారు. విన్నటిరోజున, తమ ఏకైక సంతానమైన ఆ ముద్దుబిడ్డవికి హఠాత్తుగా విపరీతమైన వ్యాధి అంకురించి బిడ్డ ప్రాణాలు తక్కవవిపించే ఘోర విపత్తు సంభవించింది. వానిపై పంచప్రాణాలు నిలుపుకొన్న తమకుకూడా జీవితాశ నశించిన సమయంలో తమ ఇలవేల్పు అయిన స్వామిని గొంతెత్తి పిలిచి మనసారా ప్రార్థించి ముడుపులు కట్టుకొన్నారట. ఆశ్చర్యంగా ఆ బిడ్డడి బాధ క్షణంలో తీసేసినట్లు రాత్రికి రాత్రే మాయమైంది. నేడు మొక్కు తీర్చుకోను తగిన సంబారాలను సమకూర్చుకొని వ్రేపల్లెకు పయనమై వస్తూ దారిలో గోవర్ధన పర్వతాన్ని కూడా, తమ ప్రాణాలు నిలిపిన చిహ్నంగా స్వామిని స్మరించి పూజిస్తున్నారు.

రాధ వారి మాటలు వింటూనే నిశ్చేష్టురాలై నిలిచింది. స్వామి లీలల కంతరార్థ మామెకు బోధపడినట్లే అనిపించింది. ఆమెది వ్రేపల్లె అని తెలుసుకొన్నవారు "మా బిడ్డను ఆ దేవదేవుని పాదాలపై పడ వేస్తాము. ఆ చల్లనయ్య లోగిలి చూపు తల్లీ'' అని ప్రార్థించారు.

వెనుదిరిగి రాధ వడివడిగా అడుగులు వేస్తూ వారితో నందగోపుని మందిరం చేరుకున్నది. ఈ పర్యాయం ఆమె ఉత్సాహం ధ్వనించే స్వరంతో "కన్నయ్యా! నీ కొరకు ఎవరు వచ్చారు చూడు'' అన్నది పాన్పు సమీపిస్తూనే.

చంద్రుని చూచి విడివడే కలువ మొగ్గలలా, ముకుళించిన స్వామి నయన కమలాలు అలవోకగా కదిలాయి. తుమ్మెదల బారువంటి కనురెప్పలు మెల్లిగా సడలినాయి. ఎర్రని పగడపు కాంతులీనే పెదవుల చివర తెల్లని చిరునవ్వు రేకలు కనీ కనిపించక విరిశాయి. కనులు తెరచి వచ్చిన వారిని చూస్తూనే శరీరం రవంత కదిపి ఇటూ అటూ మసలి చివ్వునలేచి పడకపై కూర్చున్నాడు నందుని ముద్దులపట్టి.

ఆనంద బాష్పాలతో అతడిని అభిషేకిస్తున్న తల్లితో "అమ్మా ఆకలివేస్తున్నది. నా పైడిగిన్నెలో పాలబువ్వ తీసుకొని రామ్మా'' అంటూ గారాలు ఒలికించే నల్లనయ్య మాటలకు పులకించి పోయింది యశోదమ్మ. ఆవిడ ఆప్యాయంగా తెచ్చిన గిన్నెను అందుకుంటున్న తనయుని వంక, ఆ ప్రక్కనే కషాయాలు తయారుచేసే వైద్య శిఖామణులు తీవ్రంగా చూస్తూ "కృష్ణయ్యా! ముమ్ముందు నీవీ ఔషధ సేవ చెయాలె'' అనసాగారు.

అందరి కనులవిందుగా అందాల నవ్వులు చిలికిస్తూ ఆనందధాముడు "నాకిక ఏ బాధాలేదు స్వామీ, అన్నీ తగ్గిన'' వంటూనే, ఎదుటనిలిచి కనులప్పగించి చూసే దంపతుల చేతిలో పసిబాలుని తీసికొని రమ్మని "బాబా నీకు నాకు యీ పాల బువ్వ. ఇదే మనకు పరమౌషధమురా" అంటూ వాని నోట కొంతకూరి తాను మిగిలినది ఆరగించసాగాడు యశోద తల్లి ముద్దుబిడ్డడు.

రాధ కనులవెంట యీసారి జాలువారినవి ఆనందబాష్పాలే. ఆ కన్నీటి బిందువులలో ఆమె జ్ఞానహృదయము ప్రతిబింబించి వున్నది.

—జె. సుశీలాదేవి

అశోక

## ఆంగ్లేయబోధిని

పిన్నలు, పెద్దలు ఆంగ్లము రానివారు మా ఆంగ్లేయబోధిని సహాయంతో 60 దినములలో ఆంగ్లము నేర్చుకొనవచ్చును. వెల: రూ. 10/-

## తమిళ్-తెలుగు స్వబోధిని

తమిళభాష రానివారు మా తమిళ-తెలుగు స్వబోధిని సహాయంతో 35 దినములలో తమిళం నేర్చుకొనవచ్చును. వెల: రూ. 3/-

## హిందీ-తెలుగు స్వబోధిని

హిందీ భాషను అతి సులభముగా అందరు 30 దినములలో హిందీ-తెలుగు స్వబోధినిద్వారా అతి త్వరలో నేర్చుకొనవచ్చును. వెల: రూ. 4/-

వాటికి పోస్టేజి అదనము.

బాలసరస్వతీ బుక్ డిపో (ఫోన్: 29[illegible]68) :: మద్రాసు 600 001